


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఎర్రడబ్బా

**గౌస్ వచ్చేదాకా** వరండాలో వత్తులు చేస్తూనో, రామాయణం చదువుకుంటూనో అమ్మమ్మ అలాగే కూర్చునుండేది. రోజూ గౌస్ కోసం అంతలా ఎందుకు ఎదురు చూడడం? ప్రతిరోజూ ఉత్తరాలు రాసే చుట్టాలున్నారా? అని అమ్మ అప్పుడప్పుడూ అనేది. గౌస్ మా పోస్ట్‌మేన్ పేరు.

కానీ రోజూ గౌస్ వచ్చేవాడు. ఉత్తరాలు వచ్చేవి కావు. గౌస్ మాత్రం వచ్చేవాడు. అమ్మమ్మ అతనికి ఎండాకాలం అయితే చల్లని మజ్జిగ ఇచ్చేది. చలికాలమో, వర్షాకాలమో అయితే వేడి టీ ఇచ్చేది.

అతని పిల్లల చదువులూ ,చెల్లెలి కాపురం, భార్య అనారోగ్యం గురించి అడిగి తెలుసుకునేది.

గౌస్ "ఈ మధ్య మీ చెల్లెలు రాజమండ్రి నుండి ఉత్తరం రాయలేదేం అమ్మమ్మా?" అని అడిగి, చిన్నమ్మమ్మ క్షేమ సమాచారాలు తెలుసుకునేవాడు. నాగ్‌పూర్ పెద్దమ్మ పిల్లల వివరాలు అడిగి, "అందుకేనా మీకు ఈ మధ్య ఉత్తరాలు ఎక్కువగా రావడంలేదు. పిల్లలు హైద్రాబాద్ వచ్చేసారా?" అనేవాడు.

ఒక్కోసారి "దొండపాదు బాగా కాస్తోందిటనా? విత్తనాలు తీసుకెళ్ళారుగా?" అనో,

"మీ అల్లుడి బదిలీ అయిందా?" అనో, అంటే అమ్మమ్మ మొత్తం రామాయణం విప్పి చెప్పేది.

"మా అల్లుడి చెల్లెల్ని మళ్ళీ అమ్మాయి మరిదికి ఇచ్చారు" అనేది.

"బాగుంది. అయిన వాళ్ళని వదులుకోకూడదు. మా నాయన ఈ మధ్య తరచూ జబ్బు పడుతున్నాడు. నాకు కార్డ్ వుందిగా ఆసుపత్రిలో చూపించాలి" అనేవాడు.

"గౌస్ అంకుల్" అంటూ పిల్లలం ఆనందంగా అరిచేవాళ్ళం. అతని సైకిల్ బెల్ విని "రీడర్స్ డైజెస్ట్" ఎవరో subscribe చేసి, ఇల్లు మారి వెళ్ళిపోయారని అదీ, ఒక్కోసారి "సోవియెట్ యూనియన్"లాంటి విదేశీ మేగ్‌జైన్స్ ఇచ్చేవాడు.

స్టాంపులు అయితే తీసి జాగ్రత్త పెట్టేవాడు. అవన్నీ నోట్ బుక్స్‌లో అతికిస్తే అపురూప నిధేదో చేతికి అందినట్లు, అతను మా అద్భుత 'జీనీ'లా అనిపించేవాడు.

గౌస్ నా పెళ్ళికి కూడా వచ్చి ఆశీర్వదించి, భోంచేసి వెళ్ళాడు. గౌస్ బదిలీ అయి రెడ్డి వచ్చినప్పుడు, తీసుకొచ్చి మరీ అమ్మమ్మకి పరిచయం చేసి వెళ్ళాడు. రెడ్డి కూడా అలాగే ఆ అనుబంధం మాతో కొనసాగించాడు.

పోస్ట్ కార్డ్‌లో స్టాంప్‌లు పెట్టే చోట కూడా రాసి పెనాల్టీ వేయించే మా చిన్నమ్మమ్మ కార్డ్ చూసి నవ్వుతూ ఇచ్చేవాడు. ఆవిడ ఇన్‌లాండ్ కవర్ కొనేది కాదు. కార్డ్‌లోనే ఊరెడు విషయాలు పట్టించేది.

ఇన్‌లాండ్ కవర్‌లో ఉత్తరాలు రాసే గుంభనం, గోప్యం ఆ రోజుల్లో వుండేవి కావు. అందరూ మనవాళ్ళే అనే ఫీలింగ్ వుండేది. ఎవరు చదివితేనేం అనే ధీమా కూడా. ఇలా తలపులూ, తలుపులూ మూసుకునే రోజులు కావు అవి.

ఉత్తరం రాయడం చిన్నప్పుడు స్కూల్‌లోనే నేర్పించేవారు. ఉభయకుశలోపరీ, ఇట్లు వ్రాలు.. మీ.. అని పేరూ, విలాసం.. అని ఎడ్రెస్, లక్ష్మీ సౌభాగ్యవతీ, గంగా భాగీరథీ సమానురాలూ ఎవరికి రాయాలో.. ఎవరి పాదపద్మాలకి నమస్కారాలు రాయాలో, ఏ విషయానికి పైన 'క్షేమం' అన్న హెడ్డింగ్ పెట్టాలో, పసుపు చివర్లు చూడగానే పెదవుల చివర్ల ఎలా నవ్వు పొడజూపేదో, విచారించి, చదివి చింపెయ్యాల్సిన లేఖలేవో.. ఇవన్నీ ఉగ్గుపాలతో నేర్పినట్లు, ఇళ్ళల్లో అనుభవం అయ్యేవి.

'కాగితం మీద నాలుగు పంక్తులు తీరువుగా రాయలేని ఇంగితం లేని వెధవ – వివరం చెప్పడం రాదు" అని తిట్టేవారు పెద్దవాళ్ళు. ఉత్తరాల ద్వారా కబుర్లు తెలియచెయ్యకపోతే అర్ధరాత్రి సైకిల్ బెల్ మోగితే 'టెలిగ్రాం' అని గుండెలు గుభేల్ మనేవి. అన్నీ చెడు వార్తలే కాకపోవచ్చు. కొన్నిసార్లు 'ప్రసవం అయి తల్లీ బిడ్డా క్షేమం' అనీ, కాలేజీలో సీట్ వచ్చిందనీ, ఉద్యోగం వచ్చిందనీ, లేదా ఎవరైనా అర్జెంట్‌గా మెయిల్‌కి వస్తున్నారు, వెళ్ళి రిసీవ్ చేసుకోమనో కూడా టెలిగ్రాంలు వచ్చేవి.

'పార్వతి స్టార్టింగ్ టుమారో.. స్టాప్...రిసీవ్.." అని వుండేది. తప్పుగా స్టాప్ రిసీవింగ్ అని చదవకూడదు. STOP అన్నది మధ్యలో వుండేది అంతే.

పోస్ట్‌మేన్ మధ్యలో లేకుండా, ప్రేమలేఖ రాయబారాలు లేకుండా ప్రేమలు సఫలం అయిన దాఖలాలు తక్కువ అప్పట్లో. కునేగా సెంట్ రాసో, మధ్యలో గులాబీ రేకులు పెట్టో, మొగలి రేకు పెట్టో, చందనం అద్దో, గులాబీ, లేత నీలం పసుపు రంగు కాయితాల్లో రాసి, కవర్‌లో పెట్టి పంపేవారు ప్రేమికులు. కొంతమంది రక్తంతో సైతం రాసే తీవ్రవాదులుండేవారు. ఉత్తరం వేరే రాష్ట్రాల నుండి రావాలంటే మూడు రోజులైనా పట్టేది. పైన ఎక్స్‌ప్రెస్ మెయిల్ అని కూడా రాసి, వేరే పెట్టెలో వేసేవాళ్లం త్వరగా చేరడానికి.

ఎర్రని పోస్ట్ డబ్బా మాత్రం ఎంతో ఆప్తుడిలా కనిపించేది. కథలు రాసే కొత్తల్లో ఆ డబ్బా వున్న ప్రాంతం ఎంతో విలువైనదిగా అనిపించేది. నవలలు రాసే స్టేజ్‌కి వచ్చాక పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ మాస్టర్ 'అప్పన్న 'గారు "ఏం తల్లీ.. ఎన్ని కిలోలు?" అని హాస్యం ఆడి బరువు తూచి స్టాంపులు అతికించేవారు.

"తిరిగిరావడానికి కూడా పెట్టండి" అంటే

"అపశుభం మాట్లాడకమ్మా" అనేవారు.

ఆయన ప్రేమ వాక్కు ఫలించి ఎక్కువగా, రిటర్న్ పోస్టేజీ పెద్దగా అవసరం పడలేదు ఎప్పుడూ.

పోస్ట్ ఆఫీస్‌లో, పోస్ట్‌మేన్‌తో, పోస్ట్ డబ్బాతో అలవికాని అనుబంధం చిన్నప్పటినుండీ పెనవేసుకుని పోయి పెరిగాం. చిన్నప్పుడు బడిలో లెటర్ రైటింగ్ నేర్పించినప్పటి నుండీ ఉత్తరాలు రాయడం మొదలుపెట్టేసాము.

ఉత్తరం ఎంత అందమైన, అపురూపమైన సాధనం! మన కోపతాపాలూ, రాగద్వేషాలూ వేల వేల మైళ్ళు మోసుకుని, ఎర్రటి పోస్ట్ మెయిల్‌లో తీసుకెళ్ళి, రైల్లో ఉత్తరాల డబ్బాలో ,కొన్నిసార్లు ఎయిర్ మెయిల్ కవర్లు, లేత నీలం రంగు మీద, 'పర్ ఏవియన్' అని రాసుకున్న కవర్లు తీసుకెళ్ళి విమానంలో వేసేవి. జెంషెడ్  జీ టాటా మొదటిసారిగా విమానంలో ఉత్తరాల మూటలు తీసుకెళ్ళాడు అని కిరణ్‌ప్రభగారు టాక్‌షోలో చెపితే విని ఎంతో ఆనందం కలిగింది.

'నాలో ఊహలకి.. నాలో ఊసులకి నటనలు నేర్పావూ..' అన్న పాటలా, ఉత్తరం ఎన్నో స్నేహాలని సముద్రాలు దాటించి ఒకటి చేసేది. మా ఎదురింట్లో మా స్కూలు రోజుల్లో, నూతన్ అనే ఫ్రెండ్ వుండేది. ఆమెకి టామ్ హేరిస్ అనే పెన్ ఫ్రెండ్ ఫ్రాన్స్ దేశం నుండి ఉత్తరాలు రాసేవాడు. ఒక్కోసారి ఆమెకి పెన్, పెర్‌ఫ్యూం, చాక్‌లెట్స్‌లాంటివి పంపేవాడు. నూతన్ అతనికి తన ఫోటో పంపితే, అతనూ తన ఫోటో పంపాడు. ఇద్దరూ అందమైన వాళ్ళే. ఉత్తరం రాగానే "టామ్ ఉత్తరం రాసాడు" అని నాకు కిటికీ దగ్గరకొచ్చి గుసగుసగా చెప్పేది. నేను పరిగెత్తుకెళ్ళేదాన్ని. అతను తను కథలు రాస్తానని, కవితలు రాస్తానని, అప్పుడప్పుడూ పంపేవాడు.

నేను "మీ ఇద్దరూ ప్రేమించుకుంటున్నారా?" అని నూతన్‌ని అడిగితే "ఏమో? ఔనేమో.." అనేది.

"నువ్వు ఫ్రాన్స్ వెళితే నన్ను తీసుకెళతావా?" అని అడిగేదాన్ని. నేను వాళ్ళిద్దరి గురించీ ఎక్కువగా ఊహించుకునేదాన్ని. కాలక్రమేణా ఉత్తరాలు తగ్గాయి. నూతన్ హైద్రాబాద్‌లోనే ఇంకొక అబ్బాయి ప్రేమలో పడి ఇంట్లో వాళ్ళని ఎదిరించి అతన్ని పెళ్ళి చేసుకుంది.

నాకు కూడా ఫారెన్ పెన్ ఫ్రెండ్ కావాలనిపించినా, అంత ఇంగ్లీష్ రాక, తెలుగు అబ్బాయిలతోనే సరిపెట్టేసుకున్నాను. దుబాయ్ నుండి, నేను ఆంధ్రజ్యోతిలో సీరియల్ రాస్తున్న కొత్తల్లో ఒకబ్బాయి చాలా గిఫ్ట్స్ పంపేవాడు. స్టేషనరీ, కవితల బుక్స్, నా పెయింటింగ్స్, లాంటివి. పత్రికలవాళ్ళు మొదట్లో నా ఎడ్రస్ ఇస్తే అసంఖ్యాకంగా ఉత్తరాలు వచ్చేవి. ఆ ఉత్తరాల

కట్టలు పోస్ట్‌మేన్ స్కూల్‌కి మోసుకొచ్చి ఇస్తుంటే టీచర్‌గా వున్న నాకు, ఆ స్కూల్ ఓనర్ కుళ్ళు కొద్దీ నన్ను టెర్మినేట్ చేసేసాడు.

కానీ ఆ రంగురంగుల ఉత్తరాలలో అపురూపంగా అనిపించిన కొన్ని నేను రెండు సంచులనిండా ఇప్పటికీ దాచుకున్నాను. అవన్నీ పుస్తకంగా పబ్లిష్ చెయ్యమని మా వదిన, సహ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి సలహా ఇస్తూ, హాస్యరచయిత్రి కదా ఇలా అంది "నీకు ఎంచక్కా బోలెడు ప్రేమ లేఖలొచ్చాయి.. నాకు ఒకే ఒక్కటి వచ్చింది. మరిడయ్యా, తాళ్ళ వ్యాపారి, తాడేపల్లి గూడెం నుండి" అని.

నిజమే కొంతమంది నాకు తమ జాతకం గీసి పంపిస్తూ, పెళ్ళి చేసుకుంటాం అని లేఖలు రాసారు. అప్పటికే పెళ్ళయి పిల్లలున్న నేను మా ఆయనతో కలిసి చదివి నవ్వుకునేదాన్ని.

ఒక ఫాన్ నేను పోలీస్ రిపోర్ట్ ఇచ్చి వదిలించుకునే దాకా, తనతో వచ్చెయ్యమని బెదిరింపు లేఖలు రాసాడు. అభిమానం ఎక్కువైతే కొంత ప్రమాదం కూడా వుంది. మా ఫ్రెండ్ అక్కయ్యకి సినిమా నటి సావిత్రి మీద ప్రేమాభిమానాలు ఎక్కువై, ఆవిడ కోమాలో వుందని తెలిసి, ఆవిడ్ని ఇంటికి తీసుకొస్తానని భర్తతో రాత్రింబవళ్ళు పోట్లాడి, అన్నం, నీళ్ళూ సైతం మానేసి, మానసిక వైకల్యం తెచ్చుకుంది. ఏదైనా మితం వుంటేనే అందం.

ఈ రోజు ఉత్తరాల గురించి ఎన్నెన్నో సంగతులు గుర్తుకొస్తున్నాయంటే, సెప్టెంబర్ 1, 2025 నుండీ 'పోస్ట్ బాక్స్' అనే ఎర్ర డబ్బాలు తీసేస్తున్నామని పోస్టల్ వారి ప్రకటనే కారణం. టెలిగ్రాములు పోయినప్పుడు కూడా, మా బాబాయిలందరూ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులవడం చేత నేనింతే బాధపడ్డా.

ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలకి కారణం అయిన పోస్ట్ డబ్బా ఇంక తరువాతి తరాలకి తెలిసే అవకాశం లేదు. 90 లదాకా పిల్లలందరికీ ఎన్నో తీపి గుర్తులున్నాయి ఉత్తరాల వల్ల. అదృష్టవంతులం కదా! సెకండ్స్‌లో కమ్యునికేట్ చేసే వాట్సప్, మెయిల్స్ అంత తీపి పంచగలవా?

Post your comments







